# మరో ముందడుగు..

# చౌరాస్తా.. ఇక..



www.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way



www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way
31.03.2024
మిగిలేది 2బీహెచ్‌కే మాత్రమే!

**పాఠక, వీక్షక దేవుళ్లకు నమస్తే..! మూడేళ్ల కింద చిన్న బ్లాగ్‌తో ప్రారంభమైన నా 'చౌరాస్తా' ప్రస్థానం.. అంచెలంచెలుగా విస్తరించి.. వెబ్ సైట్‌గా మారింది. తర్వాత ఈ - పేపర్‌గా ప్రారంభమై.. నాటి నుంచి నేటి వరకు డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. తాజాగా మరో మైలురాయిని దాటుకుంటూ RNI పర్మిషన్‌తో ఇక 'మన చౌరాస్తా'గా మారి మరింత విస్తరించబోతోంది. ఇంతకాలం ఆదరించినట్టుగానే ఇక ముందు కూడా మీరు 'మన చౌరాస్తా' పేపర్‌ను అక్కున చేర్చుకుంటారని ఆశిస్తూ... - మీ.. ఉప్పలంచి నరేందర్**

మన చౌరాస్తా 2
31.03.2024 ఆదివారం
www.manachourasta.com



# భువనగిరిలో చామల గెలుపు ఖాయం

■ ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు అభి గౌడ్

**జనగామ, (మన చౌరాస్తా):** భువనగిరి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్కుమార్రెడ్డి గెలుపు ఖాయమని ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షులు చిలువేరు అభి గౌడ్ దీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా శనివారం జనగామ చౌరస్తాలో బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. మొదటి నుంచి భువనగిరి పార్లమెంటు స్థానం కాంగ్రెస్కు అడ్డా అన్నారు. బీఆర్ఎస్ చినిగిపోయిన నోటుతో సమానమని ఎద్దేవా చేశారు. బీజేపీని ఓడగొట్టి దేశానికి విముక్తి తీసుకురావాలని ప్రజలను కోరారు.

# నేడు దేవరుప్పులకు కేసీఆర్

**దేవరుప్పుల, (మన చౌరాస్తా):** ఎండిపోయిన పొలాలను పరిశీలించి రైతులను ఓదార్చేందుకు మాజీ సీఎం , బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శనివారం జనగామ జిల్లాకు వస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు జనగామ జిల్లాలోని దేవరుప్పుల మండలం దారవత్ తండాలో ఎండి పోయిన పంటలను ఆయన పరిశీలిస్తారు. అనంతరం 11.30 గంటలకు సూర్యాపేట జిల్లాలోని అర్వపల్లిలో ఎండిపోయిన పంటల పరిశీలనకు వెళ్తారు. మధ్యాహ్నం 3 గంటలకు సూర్యాపేటలో మీడియా సమావేశం లో మాట్లాడనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు నల్గొండ జిల్లాలోని నిడమనూర్ మండలంలో ఎండిపోయిన పంటలను పరిశీలించి రాత్రి 9 గంటలకు ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ కు కేసీఆర్ వెళ్తారు.

# ఆకతాయిల ఆట కట్టించిన షీ టీం

**(వరంగల్, మన చౌరాస్తా):** వరంగల్ శంభునిపేట గౌట్ హై స్కూల్ ఏరియాలో ఆకతాయిలపై వరంగల్ షీ టీం బృందం మెరుపు దాడి చేసి తమదైన శైలీలో బుద్ధి చెప్పారు. వరంగల్ శంభునిపేట రంగసాపేట ఏరియాలో మహిళలను ఆకతాయిలు ఇబ్బందులు పెడుడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న షీ టీం బృందం మధ్యాహ్నం సమయంలో రెక్కీ నిర్వహించి 15 మంది ఆకతాయిలను పట్టుకున్నారు. వారికి తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. షీ టీం బృందాన్ని మిల్స్ కాలనీ ఎస్సై గోవర్ధన్ అభినందించారు. మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఇబ్బంది పెడితే 8712685257 , 8712685142, 8712685270 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐలు కుమారస్వామి, విద్య సాగర్, హెడ్ కానిస్టేబుల్ బిచ్యానాయక్, వీరేందర్, సూర్యనారాయణ, బండి భాస్కర్, కానిస్టేబుళ్లు రామ్ రెడ్డి, మహిళా కానిస్టేబుల్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



# రైతుల విషయంలో నిర్లక్ష్యం వద్దు

■ జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**బచ్చన్నపేట, (మన చౌరాస్తా) :** రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ హెచ్చరించారు. శనివారం బచ్చన్నపేట మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. యాసంగిలో కొనుగోలు కేంద్రాలకు వస్తున్న వరి ధాన్యం ను ఎప్పటికప్పుడు కాంటాలు పెట్టి వేగవంతంగా సేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 1 నుంచి ధాన్యం సేకరణకు మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు కొనాలన్నారు. గ్రామాల వారీగా కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లుల కేటాయింపు జరిగిందని, తేమ శాతం చూసుకొని రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీసీఎస్ఓ రోజా రాణి , డీసీవో రాజేందర్ రెడ్డి , జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ , తహసీల్దార్ విశాలాక్షి , ఎంపీడీవో రఘురామ కృష్ణ, పీఏసీఎస్ సీఈవో కాశెట్టి బాలస్వామి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.

## రెవెన్యూ రికార్డుల పరిశీలన..

బచ్చన్నపేట మండల రెవెన్యూ కార్యాలయాన్ని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ధరణి పెండింగ్ ఆన్ లైన్ దరఖాస్తులను పరిశీలన చేశారు. ఎన్నికల కోడ్ వల్ల ధరణి రికార్డుల పనులు ఆగినప్పటికీ, దరఖాస్తుల క్షేత్రస్థాయి విచారణ పనులు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులు బాధ్యులవుతారని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన రైతులకు పెండింగ్ పట్టాలను ఎన్నికల అనంతరం పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విశాలాక్షి, సిబ్బంది పాల్గొన్నారు.

## కొనుగోళ్లకు పది రోజులే కీలకం

**జనగామ, ( మన చౌరాస్తా) :** ధాన్యంకొనుగోళ్లకు రానున్న పది రోజులే కీలకమని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సివిల్ సప్లై కమిషనర్ డీఎస్. చౌహాన్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి రానున్న పది రోజులు ఎంతో



కీలకం అన్నారు. మండలానికో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమయ్యాయని, మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా టోకెన్ పద్ధతి ద్వారా సేకరించాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం తేమ శాతాన్ని సరైన విధంగా పరీక్షించాలని, వేయింగ్ మెషీన్ లు, గన్నీ బ్యాగులను సరిచూసుకోవాలి సూచించారు. అదే విధంగా కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని తెలిపారు. అంతకుముందు సంబంధిత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఏఈఓలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ఓ రోజా రాణి, డీఏవో వినోద్ కుమార్, డీసీ వో రాజేందర్ రెడ్డి, డీటీసీఎస్ లు శ్రీనివాస్, దేవా, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఏఈవోలు, రైస్ మిల్లర్లు, లారీ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.




# సెటిల్ అయ్యాకే పెండ్లి చేసుకోవాలి

■ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సందీప

**జనగామ, (మన చౌరాస్తా):** ఎవరైనా సరే తమ కాళ్లపై తాము నిలబడ్డాకే పెళ్లి చేసుకుంటే జీవితం బాగుంటుందని జనగామ జనగామ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సందీప అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ ఉమెన్ కళాశాలలో మహిళల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రథమంగా విద్య పైనే దృష్టి పెట్టాలన్నారు. ఆ తరువాత ఉద్యోగంతో తన కాళ్లపై తాను నిలబడాలని, అనంతరం వివాహం చేసుకోవాలని సూచించారు. మహిళలు, విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. వర్క్ ప్లేస్ లో ఆడవారికి మగవారి నుంచి ఏమైనా సమస్యలు వస్తే ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.బిందు మాధురి, లీగలైడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ ఎం.రవీంద్ర, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ జ్యోత్స్న, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీహరి పాల్గొన్నారు.

# ఫార్మ్ 12లో సవరణలు చేసుకోవాలి

**జనగామ, (మన చౌరాస్తా) :** ఏప్రిల్ 1, 2 లలో పీవోలు, ఏపీఓలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ చెప్పారు. శనివారం జిల్లాలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో భాగంగా ఫార్మ్ 12 ను పీవోలు, ఏపీఓలకు జతచేసి ఇచ్చినందున వాటిని సరిచూసుకుని సవరణలు చేసి ఎపిక్ కార్డును జతచేయాలన్నారు. రెండు ఆప్షన్స్ లో ఒకటి ఎంచుకొని మొదటి శిక్షణ కార్యక్రమం రోజున తహసీల్దార్ కు అందించాలని కోరారు. ఈ శిక్షణలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే శిక్షణ కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, ప్రొజెక్టర్లు, తదితర అన్ని సదుపాయాలను సమకూర్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ అనిల్ కుమార్, ఏఓ రవీందర్, డీఐఈఓ రాంప్రసాద్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.




# రన్ ఫర్ జీసస్

జనగామ జిల్లాలో క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం జనగామలోని ఉంద్రుపుర సెంటినరీ బాప్టిస్ట్ చర్చి నుంచి ర్యాలీని ప్రారంభించారు. పట్టణ పుర వీధుల మీదుగా ప్రెస్టన్ ఇన్స్టిట్యూట్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం ముగింపు సభ నిర్వహించుకుని అక్కడే ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఇక నల్లగొండ జిల్లాలో కూడా రన్ ఫర్ జీసస్ ప్రోగ్రామ్ ఉత్సాహంగా నిర్వహించారు. దేవరకొండ రోడ్‌లోని మరియ మాత చర్చి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ డీఈవో కార్యాలయం మీదుగా ప్రకాశం బజార్ గుండా క్లాక్ టవర్ వరకు కొనసాగింది. ఈ రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రేఖల భద్రాద్రి, ఫాదర్ జోసఫ్ రెడ్డి, టీఎస్ క్రిస్టఫర్ ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంభించారు.

- మన చౌరాస్తా, జనగామ/నల్లగొండ












మది గదిలో దాగిన జ్ఞాపకాల గమనం..
మన చౌరాస్తా..
ఆలిన్ వన్ కథనాలతో..
మీ ముందుకు వస్తోంది.
e-ఎడిషన్